క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ



దుద్యాల్: తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న జయశ్రీ

దుద్యాల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 4వ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలుపట్టడం ద్వారా తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో పని చేస్తున్న పీడీ, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీసు సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు వికారాబాద్ జిల్లా కేంద్రంలో డీఈఓ రేణుకాదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఐదు నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

లగచర్ల కళాకారుడికి సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన కళాకారుడు ఈర్లపల్లి రమేశ్ సమాజానికి ఉపయోగపడే రచనలు చేస్తూ యూట్యూబ్ వేదికగా సందేశాత్మక గీతాలు అందిస్తున్నాడు. రాఖీ పండుగ నేపథ్యంలో మరో పాటను విడుదల చేశాడు. సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా ఠాణాకు రావడంతో ఎస్‌ఐ యాదగిరి ఆయన్ను సన్మానించారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింలు

బంట్వారం: వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులను మార్క్‌ఫెడ్ అధికారులు అందుబాటులో ఉంచాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రొంపల్లి నర్సింలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన సహకార సంఘం ఎరువుల గోదాంలో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు ఎరువులు అందడం లేదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఇదే సమస్య ఉందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పత్తి, మొక్కజొన్న ఇతర పంటలకు యూరియా వేయాల్సి ఉంటుందన్నారు. సహకారం సంఘం గోదాంలలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకొంటున్నారని ఆయన విమర్శించారు. రైతులు ఎప్పుడు వెళ్లినా స్టాక్ లేదనే సమాధానం చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అవసరమైన మేరకు ఎరువులు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

దుద్యాల్: మండల పరిధిలోని చిలుముల మైల్వార్‌లో సోమవారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఆవుటి రాములు సొంత ఖర్చుతో ఈ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు గ్రామ పోలీస్ అధికారి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు తగ్గుముఖం పడుతాయన్నారు. త్వరలో మరిన్ని కెమెరాల ఏర్పాటుకు యత్నిస్తామన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన శంకర్‌ను ఎస్‌ఐ యాదగిరి అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగిరం చేయండి

దోమ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగిరం చేయాలని ఎంపీడీఓ గ్యామ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని బాసుపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. లబ్ధిదారులు అధికారుల సూచనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయర్లు జాగ్రత్త

- చిన్నపాటి మెలకువలతో ఎక్కువ కాలం మన్నిక
- తాండూరు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి



తాండూరు: పంటలకు పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. వివిధ రకాల స్ప్రేయర్లు ఎక్కువ కాలం పనిచేసేందుకు పాటించాల్సిన మెలకువలపై సలహాలు, సూచనలు అందజేశారు.

తైవాన్ స్ప్రేయర్..

- తైవాన్ స్ప్రేయర్ల ట్యాంకులో 5 లీటర్ల మంచి నీటిని పోయాలి.
- ఇంజన్ స్టార్ట్ చేసి నాజిల్ ద్వారా నీటిని బయటకు పంపాలి.
- ఇలా చేయడం వలన పైపుతో పాటు నాజిల్‌లోని మలినాలు లేకుండా శుభ్రమవుతుంది.
- ట్యాంకులో పెట్రోల్ లేకుండా తీయాలి. ప్లగ్‌ను తీసి పిస్టన్‌పై ఐదు చుక్కలు ఇంజిన్ అయిల్ వేసి బిగించాలి. = పంపు భాగాలన్నింటిని శుభ్రంగా తుడిచి భద్రపరిస్తే ఎక్కువ కాలం పని చేస్తోంది.

రీచార్జబుల్ స్ప్రేయర్లు.

- ముందు పిచికారీ పూర్తయిన వెంటనే మూడు లీటర్ల నీటిని ట్యాంకులో పోసి బయటకు పంపాలి.
- ప్రతి 15 రోజులకు ఒకసారి గంట పాటు చార్జింగ్ పెట్టాలి.
- ఇలా చేయడం వలన బ్యాటరీ డిశ్చార్జ్ కాకుండా ఉంటుంది.

హ్యాండ్ స్ప్రేయర్లు

- స్ప్రే పూర్తయిన తర్వాత 4లీటర్ల శుభ్రమైన నీటితో ట్యాంకును కడగాలి.
- నాజిల్ ద్వారా కొద్ది నీటిని బయటకు పంపించాలి.
- స్ప్రేయర్‌కు అమర్చి ఉన్న ఇత్తడి గొట్టాన్ని తీసి, ఇంజిన్ ఆయిల్ పోసి బిగించాలి.
- ఇలా చేయడం ద్వారా గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది.
- బుష్‌లు, రాడ్ల వద్ద ఇంజిన్ ఆయిల్ పూయడం ద్వారా ఎక్కువ కాలం మన్నుతాయి. ఏడాది తర్వాత తీసి వాడినా బాగా పనిచేస్తాయి.

డ్రోన్ స్ప్రేయర్

- ఇటీవలి కాలంలో డ్రోన్ స్ప్రేయర్‌లు అందుబాటులోకి వచ్చాయి. డ్రోన్ స్ప్రేయర్లు ఎక్కువగా అందుబాటులోకి వచ్చాయి. నిమిషాలు, గంటల వ్యవధిలో పని పూర్తవుతుంది.
- శిక్షణ తీసుకున్న వారు మాత్రమే వీటిని వినియోగించాలి.
- స్ప్రే పూర్తయిన తర్వాత ట్యాంకును శుభ్రం చేయడంతో పాటు బ్లేడ్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలి.
- మందు పిచికారీ చేసే సమయంలో డ్రోన్ కింద ఉండకూడదు.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి



కుల్కచర్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ



బంట్వారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు సూచించారు. సోమవారం ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కు అందజేస్తున్న రవి నాయక్



బంట్వారం: చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్

దుద్యాల్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. మండల పరిధిలోని సంత్రకుంట పంచాయతీ నన్యానాయక్ తండాకు చెందిన చందునాయక్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.40 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం రవినాయక్ బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిట్ల మొగులప్ప, రాహుల్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని నాగసాన్‌పల్లిలో ఇద్దరు బాధితులకు సోమవారం వ్యక్తులకు సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి, సంజీవులకు (ఇద్దరికి కలిపి) రూ 1.88లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చాయి. ఈ మేరకు స్థానిక నాయకులు వెంకటేశ్, జనార్దన్‌రెడ్డి తదితరులు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారుడ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్



పూడూరు: మన్నెగూడలో కేంద్ర పథకాలను వివరిస్తున్న మల్లేశ్‌పటేల్

పూడూరు: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ విమర్శించారు. సోమవారం మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మల్లేశ్ పటేల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొర్రీలు పెడుతూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘువేందర్, జిల్లా నాయకులు వెంకటయ్య, బుచ్చన్న సత్యనారాయణ, మండల నాయకులు ప్రకాష్‌యాదవ్, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

అంతారంలో ‘ఇంటింటికీ బీజేపీ’



ధారూరు: అంతారం గ్రామంలో..



కుల్కచర్ల: ఘణపూర్‌లో..

ధారూరు: మండల పరిధిలోని అంతారం, మోమిన్‌ఖుర్దు, నాగారం, మోమిన్‌కలాన్ గ్రామాల్లో సోమవారం పార్టీ శ్రేణులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రధాని మోది సాధించిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తోందన్నారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అస్తిత్వాన్ని దెబ్బతీశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిశ జిల్లా కమిటీ సభ్యులు వడ్ల నందు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు పాండుగౌడ్, జెడ్పీటీసీ ఎన్నికల ఇన్‌చార్జి సీహెచ్.వెంకటయ్య, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

కుల్కచర్ల: బీజేపీతోనే దేశ అభ్యున్నతి సాధ్యమని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘనపురం వెంకటయ్య, దిశ జిల్లా కమిటీ సభ్యుడు జానకీరాం, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఘనపూర్‌లో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అమలు చేస్తున్న ప్రతీ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిచ్చయ్య, కొండ ఆంజనేయులు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జూడ్స్ హైస్కూల్‌లో 1993–94 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల సమీపంలోని ఓ రిసార్ట్స్‌లో జరిగిన ఈ సమ్మేళనంలో స్నేహితులంతా కలిసి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుని ఆనందంగా గడిపారు.



సెయింట్ జూడ్స్ హైస్కూల్ 9193-94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

లాలపేట వాగుకు వంతెన నిర్మించాలి

కొందుర్గు: మండలంలోని లాలపేట వాగుకు వంతెన నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పలువురు నాయకులతో కలిసి ఆయన వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షం కురిస్తే వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, దీంతో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వర్షాకాలంలో వరదనీటి ఉధృతికి గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో పొలాలకు వెళ్లిన రైతులు తిరిగి ఇళ్లకు చేరేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. కొందరు రైతులు ప్రాణాలకు తెగించి వాగుదాటే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాగుకు వంతెన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌చారి, నాయకులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

షాబాద్: విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో విద్యుత్ సమస్యలు తిష్ట వేశాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల నాంధార్‌ఖాన్‌పేట్‌లో మేకల మహేందర్ అనే రైతు గేదె విద్యుత్ ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. అందుకు విద్యుత్ సంస్థ నుంచి నష్టపరిహారం అందిచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సతస్యనారాయణ రెడ్డి, సభ్యులు చంద్రయ్యగౌడ్, నరసింహారెడ్డి, కృష్ణ, ఒగ్గు మల్లేష్, చెన్నయ్య, రవీందర్‌రెడ్డి, గౌతమ్, సత్యంగౌడ్, తదితరులున్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని ఎంఈఓ మనోహర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో గల ఇండియన్ హైట్స్ పాఠశాలలో చైర్మన్ భువనేశ్వర్ ఆధ్వర్యంలో క్యాబినేట్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకునేందుకు నిర్వహించిన ఎన్నికలలో విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు విద్యార్థుల జీవితాల్లో ఒక ముఖ్యమైన భాగమన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి స్టూడెంట్ కౌన్సిల్ నియామకం ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం

ధారూరు: మండల పరిధిలోని నాగారం సమీప చెరువు కట్టపై సోమవారం గ్రామ దేవత మైసమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు నరోత్తమ్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య



కిష్టయ్య (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: వ్యాధి తగ్గడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కేశంపేట రైల్వేగేట్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ బల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. పూడూరు మండలం కంకల్‌కు చెందిన పిచ్చకుంట్ల కిష్టయ్య(80) కుటుంబంతో కలిసి కొన్నేళ్లుగా పట్టణంలోని రతన్‌కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఆయన మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తగ్గకపోవడం, వృద్ధాప్య సమస్యలు చుట్టముట్టడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఉదయాన్నే గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన రైల్వే పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కుమారులు సంతానం. స్టేషన్ మాస్టర్ రాహుల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

కీసర: లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం కీసరలో చోటు చేసుకుంది. సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్(56) ఆర్టీసీ డ్రైవర్. బైక్‌పై ఈసీఐఎల్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలో కీసరలోని థియేటర్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలకు గురైన అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తత అవసరం



ఖతాదారులకు సూచనలు ఇస్తున్న మాధవరావు

దోమ: డిజిటల్ లావాదేవీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ దోమ బ్రాంచ్ మేనేజర్ మాధవరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బ్యాంకులో ఆయన వినియోగదారులకు డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. డిజిటల్ లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో కొందరు అక్రమార్కులు అమాయకులను టార్గెట్ చేసి మోసం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ప్రజలు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదని, అవసరమైన వ్యక్తులకు మాత్రమే బ్యాంకులకు సంబంధించిన వివరాలను పంచుకోవాలన్నారు. ఏ విషయంలోనూ బ్యాంకులు కస్టమర్లకు ఫోన్లు చేసి ఓటీపీలు మరియు ఖాతా వివరాలు అడగవని చెప్పారు.

మిషన్ భగీరథపై ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మిషన్ భగీరథ నీటిని అన్ని కాలనీల్లో ఇంటింటికీ సరఫరా అయ్యే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని శివారు కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. కాలనీల్లో పర్యటించినప్పుడు మహిళలు ప్రధానంగా మంచినీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పైపులైన్ లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కార విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మార్చేందుకు చర్యలు

డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో యూనైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందా నడిచిందని, నాయకులు, సెలబ్రిటీలు సైతం డ్రగ్స్‌కు బానిసయ్యారన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేఖంగా ఉద్యమించాలన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించే బాధ్యత పౌరులపై ఉందన్నారు. సమావేశాల్లో యాంటి నార్కొటిక్ బ్యూరో సీతారాం, డీఎస్పీ సైదులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో సమీక్ష

మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు వేగం పెంచాలని, సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, తదితర దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చే జనన, మరణ, ఆదాయ, స్థానిక తదితర ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడూ జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీఓ సరిత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి

నలుగురికి గాయాలు

శంషాబాద్ రూరల్: కుక్కల దాడిలో ఇద్దరు బాలురితో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మదన్‌పల్లిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని వీధిలో ఆడుకుంటున్న కె.రియాన్(3)పై వీధి కుక్కలు దాడి చేశాయి. అతని మొఖానికి తీవ్ర గాయాలవడంతో అతన్ని చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వి.కోటేశ్(9), కె.హేమ్లు(17), వి.శివమ్మ(50) కుక్క కాటుకు గురయ్యారు. గత కొన్ని రోజులు కుక్కల బెడదతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.